# పరాభవం పొందిన పతివ్రత

పోగుల కోటీశ్వరరావు

ఇరవయ్యోశతాబ్దపు నాగరికతలోని వైభవాన్ని వైచిత్ర్యాన్ని గుర్తుకు తీసుకొని తానే అనుభవిస్తాననీ, జీవితంలోని మాధుర్యాన్నంతటినీ తనసొంత సొమ్ముగా ఆస్వాదించ గలుగుతాననీ ఊహాగానంలో విహరించిన వ్యక్తుల్లో ముఖ్యంగా పార్వతిని పేర్కొనవచ్చు. తన జీవితరథం ఏ విధమైన ఆటంకములను ఎదుర్కొనవలసిన అవసరం కలగదని, తన దాంపత్యజీవితం మూడు పువ్వులూ ఆరు కాయలుగా రాణించుతుందని పెద్దపెద్ద సౌధాలకు ఆమె మనస్సులో పునాదులు వేసుకున్నది. కడకు ఆ మేడమీద నుండి అకస్మాత్తుగా గెంటివేయబడుతానని గాని, లేక స్వయంకృతాపరాధం వల్లనే ఆ భవనం మీదనుండి క్రిందకు పడద్రోయబడుతానని గాని లేశ మాత్రమైన ఆమె గ్రహింపుకు రాలేదు. భావ వీథుల్లో ఎంత హాయిగా విహరించిందో వాస్తవ వీథుల్లో అంతకు వేయిరెట్లు అధికంగా నికృష్టపు బ్రతుకు గడపవలసి వచ్చింది.

తన పెళ్ళిరోజున నలుగురూ చుట్టూ కూర్చున్నారన్న గమనం లేకుండా, సిగ్గూ, మొగమాటమూ విడనాడి తన భర్తను చూచుకుని ఎంతగా మురిసిపోయిందో, ఆనాడు పేరంటానికి హాజరు అయిన ముత్తయిదులనడిగితే విరగబడి నవ్వి విడ్డూరంగా వర్ణించగలరు. కాపురానికి వచ్చిన తొలి రోజుల్లోగూడా పార్వతికి వ్యతిరేకమైన వాతావరణం ఎక్కడా గోచరించలేదు. అదే విధంగా తన జీవితం సౌభాగ్యంతో చక్కిలిగింతలతో పరవళ్ళుతొక్కి ప్రవహించుతుందని సంతోషంతో పొంగిపోయింది. తన అదృష్టదీపికకు గాను ఎంతమంది దేవుళ్ళకు కృతజ్ఞత తెలియజేసిందో, ఆ దేవుళ్ళల్లో ఒకరు లెక్కపెట్టాల్సిందే! సువిశాలమైన లోకానికంతటికీ ఆదర్శంగా, అద్భుతమైన ఉదాహరణగా, ముచ్చటైన మచ్చుతునకగా, తన దాంపత్య జీవితం నిలబడుతుందని, ముందు ముందు మహిళలందరికీ తన జీవనజ్యోతి వెలుగుబాట చూపుతుందని పార్వతి ఆశించింది. ఆమె ఆశాలత ఆకాశం వరకూ ఎగబ్రాకి క్రొత్త చిగుళ్ళతో పుష్పించింది.

కాని కాలచక్రం ఒకటిరెండు చుట్లు తిరిగిన వ్యవధిలోనే భయానకమైన వాస్తవాన్ని ఆమె చూడవలసి వచ్చినందుకు క్రుంగి కృశించిపోయింది. కోమలమైన పువ్వుల్లో పెట్టి పూజిస్తాడనుకున్న భర్త తనను వాడిపోయిన పూవువలె విసిరేశాడు.

నిజానికి పార్వతి ఎదుర్కోవలసి వచ్చిన కష్టం 'స్త్రీజాతి'కి సహజమైనదేనని అంగీకరించక తప్పదు. అయితే పరమపదసోపానం అధిష్ఠించాలనే మధురవాంఛతో ఆమె జీవితయాత్ర ప్రారంభించినది గనుక మధ్యలో పాములు కరవటం క్రిందుకు జారిపోవడంవల్ల ఆమె మరింతగా నిస్పృహ చెందింది.

తిరిగి తన గమ్యస్థానం చేరుకునేందుకై సరాసరి నిచ్చెనలకోసం వెదక నారంభించింది.

పార్వతి దీర్ఘంగా, మనస్సు నంతటినీ కేంద్రీకరించి ఆలోచన మొదలెట్టింది.

తన జీవితాన్నే పావులుగా చేసుకుని భర్త ఆడుతున్న చదరంగాన్ని ఆపుచేసేందుకు మార్గమే లేదా!

తన కళ్ళ ఎదుట భర్త పరాయిస్త్రీని ప్రక్కనే పదిలంగా కూర్చొన బెట్టుకుని సరస సల్లాపాలలో మునిగి తేలుతూంటే తను ఉపేక్షించి,- తత్పర్యవసానం పరోక్షంగా ఆమోదించి,- వాళ్ళకు కష్టం కలిగించకుండా సేవచేయడమే సంఘంలో ప్రతివ్రతలు ఆచరిస్తున్న ధర్మమా? అదేనా ధర్మపత్ని లక్షణం అనిపించుకునేది?

తనకు చెందిన స్థానాన్ని బలాత్కారంగా ఆక్రమించుకుని అధికారం చలాయించుతూ తనపట్ల దయాదాక్షిణ్యాలు విడనాడి దాష్టీకంగా అరుస్తూ కోలాహలం చేస్తుంటే ఆ తెలియని 'తీపి' కొద్దీ భర్తమానం వహించాడుగదా అని ఆదర్శ మహిళగా తనూ అర్థాంగీకారం ఆవలంబించాల్సిందేనా?

నోరులేని వాజమ్మలాగు ఒక తుచ్ఛమైన వ్యక్తి పాదాలకు మోకరించి, బ్రతిమిలాడి, భంగపడటమే ఉత్తమ తరగతి గృహలక్ష్మి అనుసరించ గిన విధానమా?

తన శక్తి వినియోగించుకునే ప్రయత్నం తలపెట్టకుండా తాను ఆదికాలము నుండీ వస్తూన్న 'అబల' అని తీర్మానించుకుని, 'విధి' అనే పేరుతో కొని తెచ్చుకున్న కష్టువుకు దాసోహమని దారిచూపించేందుకు మాయదారి దేవుణ్ణి ప్రార్థించుతూ తులసికోట చుట్టూ తిరిగి జపం చేస్తే, చిన్నప్పటినుంచీ చదువుకుంటున్న పురాణగాథలలోని అనసూయ, సావిత్రి, సక్కుబాయి, ఇత్యాది వారితో సహా తారా పథాన్ని అందుకో గలదా?

చదువుకున్నవాడు, సంస్కారం కలవాడు. వెనుక ముందులు పరామర్శించగలవాడు, ఉచితానుచితాలను మీమాంస చేయగలవాడు, యేనాటికైనా సరేనా గత జల సేతుబంధనం జరిపి, తానుచేసిన మోసానికి పశ్చాత్తాపపడి, తన చంచల మానసిక పరివర్తనకు తనంతట తానొచ్చుకుని సంసార స్వర్గంలోకి తిరిగి అడుగు పెట్టక పోతాడా అన్న ధీమాతో ప్రతిఘటనే ఉద్దేశానికి స్వస్తివాచకం పఠించి। తిరుపతి వెంకటేశ్వర స్వామి వారికి ఒక చిలుముకానీ ముడుపు కట్టేసి ముందుకుచూస్తే కొండ మీదకు చేసుకోక పోతాడా?

ఇలాగే పరిపర విధాల ఆలోచనలతో అంతు పట్టకుండా పడుకున్నది పార్వతి. తలుపు దగ్గరగా వేసివున్నది. మంచమీద పడుకుని చుట్టూ గోడల మీదకు శూన్యంగాచూస్తూ రెప్పవాల్చడంలేదు. కలతచెందిన ఆమె మనస్సుకు గోడలమీద రకరకాల బొమ్మలు ఆడుతూన్నవి.

తనభర్త ప్రియురాలి తలను బుజాని కానించుకుని ముంగురలను నిమురుతున్నాడు. పార్వతి శరీరం దహించుకు పోయింది.

తనభర్త ఉంపుడుగత్తె చేతులుబుచ్చుకుని సముద్రపుటొడ్డున ఇసుకతిన్నలపై చల్లగాలికి విహారం సల్పుతున్నాడు. ప్రక్కన సముద్రంలోని హోరుమనే శబ్దంకంటె మించి పార్వతి హృదయం ఘోషపెట్టింది. వొడ్డునుతాకిన అలలు నీటి తుంపరలను విదజల్లుతూ ఆ ప్రేమిప్రేమికులను అక్షింతలతో ఆశీర్వదిస్తున్నవి. పార్వతి ఆ సముద్రపు కెరటాల్లో తాను కొట్టుకపోతున్నట్టుగా అనుభవించింది.

గోడమీద బొమ్మలు ఒకదాంట్లోనుండి మరొకటి పుట్టుకొస్తూ పార్వతిని కన్నీటితో కడిగేస్తున్నవి. అంతానిశ్శబ్దం. పరిసర ప్రాంతాల్లో ఎక్కడా అలజడి అంటూ లేదు. గోడమీద గడియారం లెక్కకు పది పర్యాయములు టకుక్కన మోగింది. పార్వతి గుండెలో నిర్విరామంగా పని చేస్తున్న కొలిమి తిత్తులు బిరబిరా గాలి విసురుతూ మంటలను రేకెత్తిస్తూన్నవి.

తలుపు నెట్టుకుని ఎవరోలోపలకు ప్రవేశించుతున్నట్టు అడుగులచప్పుడు వినిపించింది. అలికిడికి తృళ్ళిపడిలేచి ఆదుర్దాగా వాకిలివైపు చూచింది పార్వతి. అర్ధరాత్రివేళ పార్వతి ఇంట్లో ధైర్యంగా జొరబడే అర్హత ఎవరుకుంటుందో వారే వెంచాశారు. పార్వతి పెనిమిటి గదిలోకి అడుగుపెడుతూనే మోహంలో 'విసుగు'ను పెద్ద

పెద్ద అక్షరాల్లో వ్రాసి పెట్టివుంచాడు. పిల్లి మెడలో గంట కట్టుదామని సమావేశం జరిపిన ఎలుకల సామెతగా పార్వతి గబాగబా పరిగెత్తుకు పోకపోయినా, మనస్సులోని ఆలోచనలు మాత్రం వెనుదిరిగి చూడకుండా మరీ వెన్ను చూపిన మాట వాస్తవం.

ఆమె భర్త షర్టు విప్పి కొంకెకు తగిలించుతూ భార్యవంక ఓ క్రీగంటిచూపు పారేశాడు. తన రాకకోసం నిరీక్షిస్తున్నట్టుగా కనిపిస్తూన్న భార్యను చూచి, అతని ఆత్మగౌరవానికీ, స్వాతిశయానికీ, ఇంతవరకూ ఏ మాత్రం భంగం వాటిల్లలేదుగదా అని సంతృప్తి చెందాడు. కాని ముఖ కవళికల్లో మార్పు ఏమీ వెల్లడిచేసినట్టుగా లేదు. కళాకాంతీ లేక దీపపుశెమ్మలాగు నిలబడ్డాడు.

పార్వతి హృదయంలో సమ్మెట వ్రేటులు క్రమంగా సన్నగిల్లిపోతూన్న సూచనలు పొడసూపినవి. భర్తను చూడగానే గుండెలమీద కుంపటి తొలగిపోయినట్టుగా తయారైంది. కొంతవరకూ విశ్రాంతిని అనుభవించిందని చెప్పాల్సుంటుంది. ఆమె జీవితంలోని విషాదఘట్టానికి అంతటితో అంతిమ వాక్యం పూర్తి చెయ్యాలని అనుకున్నది. అయితే ఆమె భర్త ఎంతవరకూ అవకాశమిచ్చాడు. అనేది ఇప్పుడు ప్రశ్న.

ఆమె అమిత ఆనందతో ఆశగా సారించిన ప్రణయద్రుక్కులను అతను నిర్లక్ష్యంచేసి తృణీకారభావంతో సమాధాన మిచ్చాడు. ఆమె వొయ్యారంపు చూపులకు బదులుగా అతను తీక్షణంగా ముఖవైఖరి మార్చాడు.

పార్వతి దగ్గరగా వెళ్ళి చల్లని మంచినీళ్ళు ఆప్యాయంగా అందించి గోముగా అతని ముఖంలోకి చూస్తే "టేబిలు మీదపెట్టు" అని అతను దూరంగా జరిగి భగ్గున నిప్పుపుల్ల ముండించి సిగిరెట్టు వెలిగించేసి ధుపుక్కుమని ఊదేశాడు.

ఆమె పెదిమిల మీద చిరునవ్వు చిందులు త్రొక్కింది. అతను పంటితో పెదిమిని కొరికి విరిచాడు.

మృదువుగా ఆమె మాట్లాడింది. కటువుగా అతను జవాబిచ్చాడు.

సంభాషణ పొడిగించి స్వాధీనంచేసుకోవాలని ఆమె వుద్దేశం. ఎక్కడికక్కడ తెగ్గోస్తే పీడ విరగడై పోతుందని అతని నిర్ణయం.

గ్రుడ్ల నీళ్ళు గ్రుడ్లను కుక్కుకుంటూ పార్వతి అలాగే నిశ్చేష్టురాలై నిలబడిపోయింది.

ప్రపంచానికంతటికీ వెలుగుచూపించ గలననుకొన్న పార్వతి ఆ చిన్నగదిలో నాలుగుగోడల మధ్యా తీవ్రమైన పరాజయం పొందినదై ఎటూ పాలుబోక నలు దిక్కులూ కలియజూచింది.

"ఛీ! బుద్ధిలేదూ" ఈ మాటలన్నది ఆమె భర్త అనుకుంటారేమో! కాదు. ఆమెను వెంట తరిమి వస్తున్న నీడయే వెక్కిరించింది.

"మానవజన్మ ఎత్తావుగాని, సిగ్గూ శరమూ లేని బ్రతుకు ఎందుకు?" గోడమీద పోటో గేలి చేసింది.

"నీ తెలివి తెల్లవార! యెన్నిసార్లు యిట్లా జరిగినా ఎప్పుడూ ఇంతే నీ జన్మ తగలడ!" దిక్కులు ప్రతి ధ్వనించినవి.

"నేను పుట్టిపెరిగిన వాతావరణం, నాచుట్టూ ప్రపంచం నన్నీ విధంగా తీర్చి దిద్దింది. నా నైజాన్ని మార్చుకోలేక పోవడమేనా నేను చేసిన తప్పు? ఏం చేసేదిమరి?" అనాలోచితంగా సమాధానం చెప్పుకున్నది.

"అయితే నీ గతి ఇంతేలే పో" అని వెంటనే బదులు పలికింది, అంతరాత్మ.

